## అడల్ట్స్ ఓన్లీ కథ

## జె. సునీల్

# వెన్నెల చీర...

'ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రోజు చందూకి చెప్పేయాలి' మనసులో అనుకుంది మేఘన.

అన్యమనస్కంగానే వంటగది సర్దేసి వచ్చి హాలులో కూర్చుంది. తను తీసుకున్న నిర్ణయం గురించి ఆలోచిస్తుంటే, మనసంతా ఏదోలా అయిపోయింది. 'కానీ తప్పదు. ఈ సమయంలో నేనేదో నిర్ణయం తీసుకోకపోతే, ఇక జీవితమంతా ఇదే విధంగా మానసిక క్షోభను అనుభవించాల్సి వుంటుంది'

ఎడతెగని ఆలోచనల మధ్య ఎంత సమయం గడిచిందో తెలియదు.

కాలింగ్ బెల్ మ్రోగింది.

ఒకప్పుడు ఆ కాలింగ్ బెల్ శబ్దం వినగానే తనకెంతో ఉత్తేజం కలిగేది. ఇప్పుడు... ఏదో తెలియని నిరాసక్తత!

చిన్న నిట్టూర్పు. మెల్లగా అడుగులేస్తూ వెళ్ళి తలుపుతీసింది.

ఎదురుగా బ్రీఫ్‌కేస్ చేతపట్టుకుని భావరహితంగా తననే చూస్తున్న చంద్రశేఖర్ ''హాయ్..'' అన్నాడు.

ఆమె బలవంతంగా నవ్వింది.

భార్యాభర్తలే అయినప్పటికీ తామిద్దరి మధ్యా అంతకుమించి మాటల్లేవు.

అతడు తనను తప్పించుకుని బెడ్‌రూమ్ వైపు నడిచాడు. డ్రస్ మార్చుకుని స్నానానికి బాత్‌రూమ్‌లో దూరాడు.

'ఇప్పుడిలా తనతో అంటీ ముట్టనట్టుగా వుండే చందు, పెళ్ళయిన తొలిరోజుల్లో తనతో ఎలా వుండేవాడు?'

మేఘనకు గతం కనుల ముందు కదలాడింది.

ఒకరోజు- కుండపోతగా వర్షం పడుతోంది. ఉరుములు, మెరుపులతో కూడిన ఆ వర్షాన్ని కిటికీలోంచే చూస్తోంది తను.

ఇంటి ముందు బైక్ ఆగింది. చందు బైక్ దిగి వస్తుంటే, తనెళ్ళి తలుపు తీసి ''వర్షం తగ్గాక రావచ్చుగా'' అంది కోపంగా.

అతడు అరక్షణం ఆలస్యం చేయలేదు. చప్పున తన నడుము చుట్టూ చేతులేసి దగ్గరకు లాక్కున్నాడు. తడిసిన చేతులు వళ్ళు జల్లుమనేలా చేసాయి. తల మీద నుండి జారుతున్న నీరు ఎదపొంగులను తాకి గిలిగింతలు పెట్టింది. తన మెడవంపులో తలపెట్టి అతడు గొణిగాడు. ''తడిసిన తనువు చల్లగా మారి, వెచ్చదనాన్ని కోరుకుంటుంది. అప్పుడు ఇల్లాలి కౌగిట వాలితే ఆ రొమాన్స్ తీరే వేరు''

చందు వర్షంలో తడుస్తూ రావడానికి కారణమేమిటో తనకు తెలిసింది.


అంతే! ఒక్కసారిగా అతడి పట్టునుండి విడివడింది. అతడు ఆశ్చర్యపోయి తననే చూస్తుంటే తలుపు బార్లా తెరిచి బయటకు పరుగెత్తింది.

చేతులు వెడల్పుగా చేసి, గుండ్రంగా వర్షంలో తిరుగుతుంటే తనెందుకు బయటకు పరుగెత్తిందో అప్పటికిగానీ చందుకి అర్థం కాలేదు. అతడు తలుపు దగ్గరే నిలబడిపోయి తననే చూడసాగాడు.

వళ్ళంతా తడిసాక, అతడికేసి చిలిపిగా చూస్తూ దగ్గరగా వెళ్ళింది ''తనువులు రెండూ తడిసినప్పుడే తమకం పెరుగుతుంది''

అతడు చప్పున తనను హాల్లోకి లాగి తలుపులు గడియవేసాడు. ఆ క్షణం అతడు పట్టిన పట్టుకు పక్కటెముకలు విరుగుతాయేమోనన్నంత భయం కలిగింది. కానీ భయంలోనూ ఆనందం కలగడం శృంగారంలోనే సాధ్యమేమో అనిపించింది. ఒకరి ఊపిరి మరొకరి తనువును వెచ్చగా తాకుతోంది.

చందు చాలా



సేపు అక్కడే తన తనువంతా తడిమి చూసి, అడ్డంకులు తప్పించాలని ఆరాటపడి, కొంత ఫలితాన్ని సాధించాడు. పూర్తిగా అడ్డు తప్పించడానికి తను అడ్డుకోవడంతో ఇక ఆగలేక, తనను రెండు చేతుల మధ్య వుంచి, గాల్లోకి లేపి బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళాడు.

తడిసిన తనువుల రాపిడిలో పుట్టే తపనలరాగం ఎంత మధురంగా వుంటుందో తనకు అప్పుడే మొదటిసారి అర్థమయ్యింది.

మరోరోజు-

చందు ఆఫీసుకి వెళ్ళబోతూ ఆగి చెప్పాడు. ''ఈరోజు నీకో కొత్తచీర అందిస్తాను''

''ఏమిటి విశేషం?'' అడిగింది తను.

''ఏమో! ఈ రాత్రికి నీ చేత కొత్తచీర కట్టించాలనిపిస్తోంది'' అనేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

'చందు ఆఫీసు నుండి ఎప్పుడు తిరిగొస్తాడా' అని రోజంతా ఎదురుచూసింది.

అతడు ఆఫీసు నుండి వచ్చాడు. కానీ కొత్తచీర ప్యాకెట్ తనకేమీ అందించలేదు. 'బహుశా బ్రీఫ్‌కేస్‌లో వుందేమో. రాత్రికి తీస్తాడేమో' అనుకుంది.

రాత్రి భోజనాలయ్యాక అతడు చెప్పాడు ''ఈరోజు డాబా మీదనే మన పడక''

''ఎందుకు?''

''కొత్తచీర కోరుకుంటే డాబా మీదకు రాక తప్పదు''

ఆ కొత్తచీర కట్టుకుని, ఆకాశం కింద చల్లని గాలి పీలుస్తూ, అతడి కౌగిలిలో ఒదిగిపోవడం, సరికొత్త అనుభవంలా మిగిలిపోతుందనిపించింది. అందుకే మారు మాట్లాడక పడకను డాబా మీదకు షిఫ్ట్ చేసింది.

ఆ ఏరియాలో అంత ఎత్తయిన ఇల్లు లేదు. పైగా ఇంటి ఆవరణలో ఎత్తయిన చెట్లు. అందువల్లే ఏం చేసినా ఎలా ప్రవర్తించినా చూసేవాళ్ళు ఎవ్వరూ వుండరు.

డాబా మీదకు చేరుకున్నాక అతడు కొంటెగా చూస్తూ ''కొత్తచీర కట్టుకోవాలంటే కట్టుకున్న చీర విప్పాలిగా'' అన్నాడు.

అప్పటివరకూ తను ఆ విషయమే ఆలోచించలేదు. 'అవును మరి! కొత్తచీర కట్టుకోవాలంటే కట్టుకున్న చీర విప్పాలి కానీ.. ఆకాశంలోంచి చంద్రుడు చూస్తుండగా, అందులోనూ కట్టుకున్న వాడు పక్కనుండగా చీరకట్టు తప్పించడం..' తన కెంతో సిగ్గేసింది.

అందుకే చూపులు నేలవాల్చి చెప్పింది ''మీరు చీర ఇవ్వండి. నేను కిందికెళ్ళి మార్చుకొస్తాను''

''అబ్బా! ఆశ! ఊహు! విప్పుకోవడమైనా, కట్టుకోవడమైనా ఇక్కడే జరగాలి''

తను తల అడ్డంగా ఆడిచింది. ''ఊహు! నా వల్ల కాదు. నాకు సిగ్గేస్తోంది''

''సిగ్గు వదిలేయాల్సిన పని చేయబోతూ సిగ్గుపడడంలో అర్థం లేదు''

ఎంత చెప్పినా తను వినకపోవడంతో అతడే దగ్గరగా వచ్చాడు. మొదట కౌగిలిలో బంధించాడు. ఆ తర్వాత అతడేం చేస్తున్నాడో తనకు అర్థమయ్యింది. అడ్డు చెప్పాలనుకుంది. కాని అతడి చేతులు తన తనువుని మత్తులో ముంచేసినట్టున్నాయి. ప్రతిఘటనకు ఏ అవయవమూ తనకు సహకరించడం లేదు. తన మాట వినడం లేదు.

పది నిముషాలు గడిచాయి. తనువంతా పరవశంతో మునిగిపోగా అప్పుడే తన పరిస్థితేమిటో చూసుకుంది. ఒక్కసారిగా సిగ్గు ముంచుకొచ్చింది. మొగ్గలా ముడుచుకుపోసాగింది. కనీసం అతడినైనా అడ్డుపెట్టుకోవాలని చూసింది.

ఆ ప్రయత్నం గమనించినట్టు అతడు తన నుండి దూరంగా జరిగాడు.

వీలయినంతమేర తనువును చేతులతో కప్పుకుంటూ సిగ్గు, కోపం మిళితం చేసి అడిగింది.

''కొత్తచీర ఇవ్వండి కట్టుకుంటాను''

''ఆల్రెడీ కొత్తచీర కట్టుకునే వున్నావ్‌గా''

అతడేమన్నాడో తనకు అర్థంగాక ''ప్లీజ్! కొత్త చీర ఇచ్చేయండి కట్టుకుంటాను'' బతిమాలింది. అతడి నుండి రెస్పాన్స్ లేకపోవడమే కాదు, పైగా తనను తదేకంగా పరిశీలనగా చూడడం గమనించి, ఇక వుండలేక పాతచీరనైనా అందుకుందామని కిందికి వంగింది.

## మల్లికా? మజాకా?

**అనిల్ కపూర్-మల్లికా షెరావత్ కలిసి 'వెల్‌కమ్' అనే సినిమాలో నటించారు. ఆ సినిమా షూటింగ్‌లో మల్లిక బిహేవియర్ గురించి మాట్లాడుతూ అనిల్ కపూర్- 'నిజంగా మల్లికా షెరావత్ ఎంతో ప్రొఫెషనల్‌గా వుంటుంది. చాలా మంచి అమ్మాయి' అంటూ కితాబిచ్చాడు. ఇది బానే వుంది. కానీ తాజాగా ఓ సినిమాలో అనిల్ కపూర్ సరసన నటించమని ఓ సంస్థ మల్లికను అడిగితే 'అబ్బే! ఆయనతో అయితే నేను నటించను' అని నిర్మొహమాటంగా చెప్పేసిందిట. ఆ మాట విన్న అనిల్ కపూర్ పరిస్థితిని గురించి ఇంకేం చెప్పగలం?**



అది చూసి అతడు ఒక్క అంగలో తనను చేరుకుని వెనుక నుండి వాటేసుకున్నాడు. ''వద్దు! కొత్తచీర విప్పి, పాత చీర చుట్టుకోవద్దు'' తన భుజాలు పట్టి వూపేస్తూ పలికాడు.

తొలిసారి తను చందుకేసి అయోమయంగా చూసింది. అప్రయత్నంగానే గొణిగింది. ''నేను..నేనెక్కడ కొత్తచీర కట్టుకున్నాను?''

''మరి నువ్వు కట్టుకున్న వెన్నెల చీర కొత్తది కాదా?''

అప్పుడే అతడు ఆకాశంకేసి చూసాడు. తనూ తలెత్తి ఆ వైపు దృష్టి సారించింది.

ఆకాశంలో చంద్రుడు తెల్లగా వెలిగిపోతున్నాడు. వెన్నెల నేలకు జారి తనువుల మీద తెల్లని పరదాలను సృష్టిస్తోంది.

అప్పుడే అతడి గొంతు మృదుమధుర నాదంలా చెవులను సోకింది.

''మేఘనా! నాలుగు గోడల మధ్య కవరులో నుండి తీసిన చీర నీ చేత కట్టించడంలో కొత్త ఏముంటుంది? ప్రకృతి

ఒడిలో పులకరించిపోతూ వె..న్నె..ల.. చీ..ర..ను.. నీ చేత సింగారింప చేయడం మనిద్దరికీ మరిచిపోలేని అనుభూతి కాదా?''

అప్పటికిగానీ అతడు తన చేత కట్టించిన చీరేంటో అర్థం కాలేదు. అర్థంకాగానే ఒక అపురూపమైన అనుభూతి మనసును చుట్టేసి మరో లోకాలకు తీసుకెళ్ళిపోయింది.

ఆ రాత్రి తమకు ఒక సుమధుర కావ్యం... అంతే!

''అన్నం వడ్డిస్తావా?''

మేఘన ఉలికిపాటుతో గతాన్ని వదిలి, వర్తమానంలో పడింది.

చంద్రశేఖర్ స్నానం చేసి నైట్‌డ్రెస్‌లో హాల్లోకి వచ్చి వున్నాడు.

ఆమె డైనింగ్ టేబుల్‌వైపు నడిచింది.

ఇద్దరూ మౌనంగా భోంచేస్తుంటే, ఆమె తన మనసులోని మాట చెప్పడానికి నోరు తెరిచింది.

సరిగ్గా అప్పుడే అతడు ఆమెకేసి చూసి చెప్పాడు. ''అన్నట్టు చెప్పడం మరిచాను. ఆదివారం అమ్మ మనింటికొస్తుంది. ఓ వారం, పదిరోజులు వుండొచ్చు''

తను చెప్పాలనుకున్న మాటలు పెదవి చివరే ఆగిపోయాయి. 'అత్తగారిక్కడికి రాబోయే ముందు ఆ మాటలు చెప్పడం అనవసరం. ఆమె వెళ్ళిపోయాక విషయం చెప్పి ఓ నిర్ణయానికి వస్తే మంచిది' మనసులోనే అనుకుంది.

★ ★ ★

సిటీలోని కొడుకు దగ్గరకు రావటం రాజేశ్వరమ్మకు అదే మొదటిసారి.

'ఈ వారం, పదిరోజులు అత్తగారిని బాగా చూసుకోవాలి' అనుకుంది మేఘన.

కానీ మొదటిరోజు మధ్యాహ్నం అన్నం వడ్డించగానే ముద్ద కలుపుకుని నోట్లో పెట్టుకుని ''కూరేంటమ్మా ఇంత చెత్తగా చేసావ్'' అంది.

ఆవిడ మాటతో మేఘనకు కోపం నషాళానికి అంటింది. అయితే మొదటిరోజే గొడవ ఎందుకని వూరుకుంది.

ఆ సాయంత్రం ఆవిడే దగ్గరుండి కోడలి చేత వంటలు చేయించింది.

''ఈ కూరలు నేను చేసానని చెప్పకు. నువ్వే వండావని చెప్పి వాడికి వడ్డించు'' అంది.

రాత్రి చంద్రశేఖర్ భోంచేస్తున్నప్పుడు, అతడి ముఖంలో సరికొత్త వెలుగును గమనించి ఆశ్చర్యపోయింది మేఘన.

''కూరలు చాలా టేస్టీగా వున్నాయమ్మా! అచ్చు నీ చేతి వంటలానే వుంది. నువ్వే చేసావ్ కదూ?'' అతడు కనిపెట్టేసాడు.

''కాదు నేను దగ్గరుండి కోడలి చేత చేయించాను''

చాలాకాలం తర్వాత అతడు సుష్టుగా భోంచేయడం చూసింది మేఘన.

తొలిసారి తన భర్త తనకు కొత్తకోణంలో కనిపించినట్టయ్యింది. కానీ ఆ కొత్తకోణం ఏమిటో తనకు అర్థం కావడం లేదు.

రోజూ ఎనిమిదింటికి నిద్రలేవటం మేఘనకు అలవాటు. అత్తగారింట్లో వున్నారు కదాని ఆరోజు ఆరింటికే నిద్ర లేచింది.

చంద్రశేఖర్ అప్పటికే తన పనులు ప్రారంభించేసాడు. అంత ఉదయాన్నే తన భర్త పడే హడావుడిని గమనించాక, అతడికి కావలసినవి కొన్ని అందిస్తూ సహాయపడింది.

చిత్రంగా..రాత్రి అతడి కళ్ళలో కనిపించిన కాంతి, ఇప్పుడు మెరుపులా మెరుస్తోంది.

అతడు ఆఫీసుకెళ్ళిపోయాడు.

రాజేశ్వరమ్మ కోడలిని దగ్గర కూర్చోబెట్టుకుని ''ఏమ్మా! మీ ఆయనకు ఇష్టమైన వంటల గురించి, అలవాట్ల గురించి నీకు తెలుసా?'' ప్రశ్నించింది.

మేఘన తల అడ్డంగా ఆడించింది.

''ఈరోజు వాడికిష్టమైనవని చేసిపెట్టు'' అంటూ కొన్ని వంటల గురించి చెప్పింది ఆవిడ.


**కేశవర్ధిని ...**

**పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం**



పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన
శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందజేశారు.
కొద్ది చుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో
కలిపి శిరోజాలకి రోజూ రెండు సార్లు బాగా రాస్తే అవి
ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ
లాడూతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.
ఈ రోజే కేశవర్ధిని కొనండి.
ఆరు నెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




**కేశవర్ధిని**

**తలనూనె**

కేశవర్ధిని ప్రొడక్ట్స్,చెన్నై - 600 087

చంద్రశేఖర్ ఆఫీసు నుండి వచ్చాక "కాసేపు డాబా మీద కూర్చుంటాం" అంటూ అత్తగారు కొడుకుని వెంటపెట్టుకుని డాబా మీదకెళ్ళింది.

తను చేసిన పిండివంటలు ట్రేలో పెట్టుకుని, డాబా మెట్లు ఎక్కుతున్న మేఘన, అత్తగారి నోట తన పేరు వినిపించి అక్కడే ఆగిపోయింది.

"ఏరా! మీ ఆవిడతో నువ్వు కలిసిమెలసి వుండడం లేదు. కారణమేంటి? మేఘన వైపు తప్పులేమైనా వుంటే నాతో చెప్పు"

"తప్పులంటే.." అంటూ కాసేపు నసిగి, ఆ తర్వాత కంటిన్యూ చేసాడు.

"తప్పులంటే తప్పులేం కాదమ్మా! నన్నసలు పట్టించుకోవడం లేదన్న బాధ వుంది. తను ఉదయం ఎనిమిదింటికి నిద్రలేస్తుంది. నేను ఆఫీసుకెళ్ళే హడావుడిలో వుంటే ఎలాంటి సహాయమూ చేయదు. వంట రుచిగా వుండదు. ఇంటిని శుభ్రంగా వుంచుకోదు. పెళ్ళైన కొత్తలో అయితే, అన్నీ సర్దుకుపోయాను. కానీ జీవితాంతం ఎలా సర్దుకుపోగలను? విసుగేస్తోంది. అర్థం చేసుకుంటుందేమోనని ముభావంగా వుంటున్నాను"

ఆవిడ దీర్ఘంగా నిశ్వసించింది. "ముభావానికి కారణం కనిపెట్టాలంటే మనసు లోతుల్లోకి తొంగి చూడాలి. అది అందరికీ సాధ్యం కాదు. మన మనసు అర్థం చేసుకునేలా మనమే మాట్లాడాలి. అమ్మగారింట్లో ఆడపిల్లకు హక్కులే వుంటాయి. బాధ్యతలు తెలియవు. మనమే ఆ బాధ్యతలు విప్పి, విడమరచి చెప్పాలి. మనకు కావలసిన విధంగా మలచుకోవాలి. అంతే తప్ప కట్టుకున్న ఇల్లాలి తప్పులు భూతద్దంలో చూసి బాధపెట్టటం సరికాదు"

"క్షమించమ్మా"

మేఘనకు అడుగు ముందుకు పడలేదు. నెమ్మదిగా వెనుతిరిగి అడుగులో అడుగేసుకుంటూ వంటగది చేరుకుంది. 'పెళ్ళయిన ఆరు నెలలకే తనకు, చందూకి మధ్య ఏదో తెలియని దూరం పెరుగుతోందని అనుకుంటోందిగానీ, ఆ 'దూరానికి' ఓ కారణముందా? అతడికి తన పనులు, ప్రవర్తన నచ్చడం లేదా? మరా విషయం ముఖం మీదే చెప్పొచ్చు కదా? అదీ నిజం కాదు! అలా చెప్పలేకే అతడు చూచాయగా అర్థమయ్యేలా ఇన్‌డైరెక్ట్‌గా చెప్పాడు. తనే పట్టించుకోలేదు పైగా అతడే తనను పట్టించుకోవడం లేదని అపోహ పెంచుకుని, ఆఖరికి ఎలాంటి 'నిర్ణయం' తీసుకోవాలనుకుంది?!'

భుజం మీద ఆప్యాయపూరిత స్పర్శ. మేఘన ఉలిక్కిపడి తిరిగి చూసింది.

అడుగుదూరంలో నిలబడి తనకోసే చూస్తున్న అత్తగారు!

"అత్తయ్యా! అది..అది.. మీ కోసమే ఫలహారాలు తీసుకొద్దామని సర్దుతున్నాను"

"అవి అందించడం కన్నా, నువ్వు అందుకోవలసినవి కొన్ని వున్నాయి. నా వెంటరా" అంటూ రాజేశ్వరమ్మ మేఘన చెయ్యి పట్టుకుని పెరటి వైపు నడిచింది.

ఇద్దరూ చెట్టు కింద ఎదురెదురుగా నిలబడ్డారు.

"విన్నావుగా వాడి మాటలు?"

తను మెట్లెక్కి ఆగిన విషయం అప్పుడే తెలిసింది ఆమె గమనించిందని! కానీ సిగ్గుపడలేదు. నిలువుగా తలాడించింది.

"మరి నువ్వేమనుకుంటున్నావ్?"

"ఆయనను అర్థం చేసుకోలేకపోయానని తెలుసుకున్నాను"

ఆవిడ కోడలికేసి ప్రశంసాపూర్వకంగా చూసింది. "సమస్యను చాలా త్వరగానే అర్థం చేసుకున్నావ్. చూడమ్మా! స్త్రీ జీవితంలో కూతురుగా, భార్యగా, అమ్మగా, అత్తగా నాలుగు దశలున్నట్టే, ఇల్లాలి జీవితంలో నాలుగు రూపాలుంటాయి. దాసి, మంత్రి, తల్లి, రంభ! ఈ నాలుగు రూపాలను ఆడది ఏకకాలంలోనే ప్రదర్శించాలి. ఈ రూపాలలో ఏ రూపం ప్రదర్శించకపోయినా ఆ స్త్రీ పరిపూర్ణ మహిళ కాలేదు. పరిపూర్ణ మహిళ కాని ఇల్లాలి మీద ఏ మగాడికైనా అసంతృప్తి వుండి తీరుతుంది"

మేఘన మనసులో ఏదో చిన్న అనుమానం! అదే అడిగింది "కానీ ఆయన పెళ్ళైన కొత్తలో నాతో బాగానే వుండేవారు. ఆ తర్వాతే ఎందుకిలా మారారు?"

"పెళ్ళికి ముందు మగాళ్ళ ఆలోచనలు 'శయనేషు రంభ' దగ్గరే ఆగిపోతాయి. అందుకే ప్రేమలో, పెళ్ళి చూపుల్లో మగాడు 'అందం' చూసి ఆడదానిని ఇష్టపడతాడు. కానీ సంసార జీవితం మొదలయ్యాక పడకగది సుఖం మాత్రమే ప్రధానం అనుకోడు. అతడికి మరెన్నో కావాలి. చక్కటి భోజనం కోరుకుంటే 'భోజ్యేషు మాత' కావాలి. తన పనులలో సహాయ సహకారాలు అందించే వేళ భార్య 'కరణేషు మంత్రి'గా మారాలి. అతడికి కొన్ని సపర్యలు చేయాలి. దానర్థం 'కార్యేషు దాసి' కావాలని. కాలక్రమంలో పురుషుడు ఇవన్నీ కోరుకుంటాడు. పురుషుడు కూడా సంసార జీవితంలో పలు రూపాలు, ప్రదర్శిస్తుంటాడు. కష్టపడే వేళ కూలివాడిగా, కన్నబిడ్డల దగ్గర ఉపాధ్యాయుడిలా, కట్టుకున్న ఇల్లాలి దగ్గర సరసుడిలా, కన్నవారి పట్ల ప్రేమను కురిపించే అభిమానిలా.." ఆవిడ పూర్తి చేయనేలేదు.

"అర్థమైంది అత్తయ్యా" చెప్పింది మేఘన.

★ ★ ★

ఆ రాత్రి చంద్రశేఖర్ ఆమెను దగ్గరకు తీసుకుని "సారీ మేఘనా! ఈమధ్య నా మూడ్ బాగోలేక నీతో ముభావంగా వున్నాను" అన్నాడు.

"నేను కూడా మీకు ఇబ్బంది కలిగించాను" చెప్పింది మేఘన. అంతే తప్ప, అతడి నుండి విడాకులు కూడా తీసుకోవాలనే ఆలోచన చేసినట్టు చెప్పలేదు.

"రేపు మనం డాబా మీదకు వెళ్దామా?"

"తప్పకుండా! నేను వెన్నెలచీర కట్టుకుని చాలా కాలమయ్యింది. నాకూ ఆ చీర కట్టుకోవాలని మనసు లాగేస్తోంది" సిగ్గును దాచుకుంటూ చెప్పింది.

"అమ్మదొంగా! నీకు 'వెన్నెల చీర' కావాలా? అది రేపు..ఈ రాత్రికి మాత్రం 'చీకటి చీర' చుట్టబెడతాను" అంటూ ఆమెను అల్లుకుపోసాగాడు చంద్రశేఖర్.

★ ★ ★

రాజేశ్వరమ్మ లగేజీ సర్దుకుంటుంటే "మరో నాలుగు రోజులు వుండకూడదా అత్తయ్యా" మనస్ఫూర్తిగానే అంది మేఘన.

"లేదమ్మా! మీ మామయ్య నా కోసం ఎదురు చూస్తుంటారు"

ఆవిడ ఇంట్లోంచి బయటకు నడుస్తుంటే, మేఘన మనసులోనే అనుకుంది. 'థాంక్స్ అత్తయ్యా! అత్తగారంటే కొడుకు, కోడలి మధ్య మంచి సంబంధాలు ఏర్పరచే వారధి అని నాకర్థమయ్యింది. కొడుకు ఇష్టాలు, కష్టాలు అర్థం చేసుకోగలిగింది తల్లి. ఆ ఇష్టాలను కష్టాలను విప్పి చెప్పి కోడలిని మలిచేది అత్తగారు. ఆ వారధి లేకపోతే రెండు కలసిన జీవితాల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడి, పరిస్థితులు ఎటైనా తీసుకెళ్ళొచ్చు. నా జీవితాన్ని చక్కదిద్దినందుకు వన్స్ ఎగైన్ థాంక్యూ'

☆

